# వద్యైకాల

ఎమ్. రామకోటి

పాడేరెళ్ళాలి, జీపు సిద్ధం చెయ్యమన్నాడు కంట్రాక్టర్ రెడ్డి. ఎన్ని కత్తిపోట్లు తిందో మరి, రామస్వామి గుండె కరాలుపుంది.

పరువు పోయిన ఊరు వెళ్ళడానికి మొహం చెల్లదు. దగా చేసిన ఆడదాని మొహం చూడ మనసొల్లదు. అయినా ఉన్న ఊరు కన్నెపడుచు లాంటిది. మనసిచ్చిన మగువలా ఉచ్చులేసి జివ్వుజివ్వుమని లాగుతూనే ఉంటుంది. రెడ్డిబాబుగారు మరో డ్రైవరుని తీసుకుని పాడేరు వెళితే తనని పిలవనందుకు గిజగిజలాడిపోను రామస్వామి. తీరా వెళదాం రమ్మంటే ఎందుకు, బాబూ అని సాకులు చెప్పబోయేడు. తల అమ్ముకున్న తరవాత తప్పుతుందా? చక్రం చేతిలో ఉన్నా, చిత్తం వచ్చినట్టు తిప్పలేడు.

"కాఫీ చోడారంలో తాగుదాంరా, రెడ్డీ" అన్నా రందరూ.

"మళ్లీ హోటలుకాఫీ ఏం కర్మరా?... ఫ్లాస్కునిండా కాఫీ ఉంది, కిట్‌నిండా టిఫినుంది ... నో నో. డిలే ఎందుకురా? ఎండ ముదరకుండా పాడే రెళ్లిపోదాం."

"ఆ స్టాక్ ఎమర్జెన్సీకిరా, భాయీ... పశాస్త్రీయంగా లాంఛనాలు జరిగిపోవలిసిందే" అన్నాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశరావు, తుపాకీ బేరలు చేతిరుమాలుతో తుడుస్తూ.

"అవున్నా... హోటల్లో బ్రేక్‌ఫాస్ట్... జీపులో లంచ్" అని జోగారావు కొత్తపేక సీలు విప్పి సీటుమీద పెట్టేడు.

"ఏమిటోయ్ ఆ బులిపింపూ?... మళ్లీ పక్కన పెట్టేస్తావేం?... కలిపి కొయ్యరా, డాక్టరూ" అని పేక అందుకోబోయేడు జనార్దనం.

"కోతలు కోర్టులో కొయ్యరా, లాయరూ... జీపులో కాదు."

"కోర్టులో నేమా... ఆస్పత్రిలో నువ్వూ... ఇద్దరమూ కోసేవి కోతలే... కలిపి ముక్కలు పంచరా, బడుద్ధాయీ... బతుకే జూదం, కోతలూను... కొయ్‌రా కొయ్."

బతుకు జూదమే మరి! నిజం ఎప్పుడూ కోతబడుతుంది. మనసు వాతబడుతుంది. పావుల్ని పులి మింగుతుంది. అలిమిని బలిమి కొడుతుంది. బలిమిని బొమ్మదేవుడు కొడితే ఆట గెలుపు. లేదా, బతుకు మలుపు తిరుగుతుంది. కంతలూ, పుంతలూ పడుతుంది. గళ్లమధ్య కళ్లు తిరిగి గొరి గుంట ఆట కానుకోలేకపోయేడు. కోతలూ, మేతలూ చికాకు పెడుతున్నాయి. రామస్వామిని.

కంటిముందు విశాఖపట్టణం కనుమరుగవుతూంది. సింహాద్రి జూలు దులిపి మత్తుగా లేచి ముందుకి మోరసాచి బద్ధకంగా ఆవులించింది. జారగిలి వెనకబడిపోయింది. పెందుర్తి సరుగుడుతోటలూ, సబ్బారం మలుపూ చిటికలో దాటిపోయేయి. పొయ్యిసెగ వడగొట్టింది. పాకానికొచ్చే చెరుకు బెల్లం తియ్యగా మత్తుగా గాలంతా అలుముకుని నిండిపోయింది. చెవులు గింగిర్లెత్తిస్తూ శంఖంలా జీపు హోరను విరామం లేక మోగుతున్నా, నదురూ బెదురూ లేకుండా చోడవరం పంచదార మిల్లుముందు చెరుకుబళ్లు తీరుబాటుగా రోడ్డుమీద జోగుతున్నాయి. పిచ్చికుక్కలా బర్రుబర్రుమని గుర్రుమంది జీపు.

"ఎహెహే! ... ఏంటయ్యో, డ్రైవోరూ ... మా పాన్లేదేటి?... గొడ్లు బెదిరిపోతున్నయి" అని నోట్లో చుట్ట తీసి తుబుక్కున ఉమ్మి కాడిమీదనించి కిందికి ఉరికేడు బండినాయుడు.

"నువ్వు బెదర్లేదేంరా? ... సెమిటినాయాలా... బండి పక్కకి తోలు... మదు వెనక్కి ఎలిపోగలవు. అత్తోరింటికా, అమ్మోరి సంబరానికా అంత దీమాగా ఎల్తన్నవు, బొంటునాయాల... తప్పుకో" అని దబాయించి బండిని, చక్రాన్ని ఆనుకున్న నాయుణ్ణీ ఒక్క తోపు తోసి జీపు బుర్రుమనిపించి రానుకుపోయేడు రామస్వామి.

గొడ్లు బెదిరిపోయి బళ్లవరస రోడ్డువారకి ఒరిగిపోయింది. ఊలుపువ్వు కొరడా కొన భుజంమీద వేలాడించుకుంటూ, నోరు వెళ్లబెట్టుకుని చూస్తూ ఉండిపోయేడు నాయుడు.

బతుకంతా దూసుకు రానుకు పోవడమే అయిపోయింది రామస్వామికి.

బాబుగారు మరో డ్రైవర్ని తీసుకుని పాడేరు వెడితే తనని పిలవనందుకు గిజగిజలాడిపోను అతగాడు. తీరా వెళదాం, రమ్మంటే ఎందుకు బాబూ అని సాకులు చెప్పబోయాడు. తల అమ్ముకున్న తరవాత తప్పుతుందా? ఏమైనా చక్రం చేతిలో ఉన్నా చిత్తం వచ్చినట్టు తిప్పలేడు.

"వేగం కానియ్యండ్రా, బాబూ... సైట్ సీయింగూ ... ప్రకాశరావుగాడి పిట్టలవేటూ ... అన్నీ ఈవేళ అయిపోవాలి. తెల్లారేసరికల్లా గూడు చేరుకోవాలి. టెండర్లుపెట్టాలి. నో డిలే... క్విక్ ... క్విక్. ఏయ్, సర్వరూ ఏమున్నాయి, బాబూ? వేగం, వేగం" అంటూ హడావిడి పడిపోతున్నాడు రెడ్డి.

"చేతిలో జీపుండగా... మన కేమిటిరా ... ఎప్పుడు, ఎక్కడ వాలాలన్నా వాలగలం. ఉయార్ మాస్టర్స్ ఆ ఫవ రోవ్ టైమ్స్... కాలానికి కళ్లెం వేస్తాంరా, భాయీ" అన్నాడు ప్రకాశరావు, పాడేరుమడుగులో కొంగలగుంపుని ఊహాపథంలోంచే గురి చూస్తూ.

కాలంలో ఉన్నానని తనూ ఒకనాడు వెయ్యబోయేడు కళ్లెం. కాలంలో ఉంది గౌరి. గురి చూసేడు. రెక్క విప్పిన కొంగలా, మెడ చాచిన హంసలా తెలిపైట పురివిప్పి ఆయిమాయి గారిడీ చేసింది. వల పన్ని పెలి తిప్పేడు. ఉరిలో పడ్డట్టే పడి తుర్రుమంది బులాకీపిట్ట.

'ఏటో అనుకుంటున్న డ్రైవర్ మొకం... కాలానికే ఏస్తాడంట కళ్లెం. గుర్రమనుకుంటన్నడు. రవ్వలెట్టి పిట్టల్ని కొట్టడ మనుకుంటన్నడు గుంటడు' అనుకుని ప్రకాశరావు వేపు తీక్ష్ణంగా చూసేడు రామస్వామి.

దూరంగా కూర్చుని ఇడ్లీ, పూరీ లగాయించి ఒక్క గుక్కలో టీ పట్టేసి కసిగా ఖాళీగ్లాసు టేబిలుమీద కొట్టి, లేచి జీపులో నీళ్లు పొయ్యడానికి వెళ్లిపోయేడు. కిళ్లీలు బిగించి, సిగరెట్లు ముట్టించి పిక్నిక్‌బృందం రథంమీద కూర్చున్నారు. ఏక్సిలరేటర్ నొక్కి స్టీరింగ్ తిప్పబోయేడు రామస్వామి. జంతువు జాడ పసిగట్టిన వేటకుక్కలా


A.S.Murty

ఒక్కమారు కుదిపి ముందుకి దూకింది జీపు.

"బండి గేర్లో ఉంది, రామస్వామీ... మందమతిగా ఉన్నావు, జాగర్త్తోయ్" అని హెచ్చరించేడు రెడ్డి.

"రామసామీ, బండి గేరులో ఉంది. బాబూ, రామసామీ, కనికరించు. పిల్లలవాళ్లమి" అన్నాడు జోగారావు నవ్వుతూ.

'పిరికిసన్నాసులు!' అనుకుని గేరు మార్చేడు రామస్వామి.

"వెయ్యిరా ముక్కలు." జనార్దనం తేల్చేడు.

"అంత కక్కుర్తి పడకపోతేనేం?" అని పేక కలుపుతున్నాడు డాక్టరు.

"కుదుపురా. ఫ్రంటు సీట్లో నేనూ, వెనక మీరూ. . . ఆట కుదరదు. అయినా ఇంట్లోనూ, క్లబ్బులోనూ, జీపులోనూ పేకాటేనా?. . . ఇంత జూదగొట్టువెధవలై పోయేరేంరా?" అన్నాడు రెడ్డి నవ్వుతూ.

"మవ్వొల్లకోసే. . . మాను సద్దుకుంతం" అన్నాడు ప్రకాశరావు.

అందరూ గొల్లుమని నవ్వుకున్నారు.

ఎక్కుళ్లు పడ్డట్టు బెక్కుబెక్కుమని తుప్పున తూలింది జీపు. అందరూ సీట్లోకి అంటుకుపోయేరు.

"మళ్లీ ఏమొచ్చిందోయ్, రామసామీ. . . ఏమిటి సంగతి?"

"గతకలు, బాబూ. . . ఎప్పుడూ సాఫీగా ఎలిపోద్దా?" అంటూ గేరు మార్చి ఏక్సిలరేటర్ తొక్కేడు రామస్వామి.

నేల విడిచి పైకెగసే విమానంలా రోడ్డుమీద అడుగెత్తున పరిగెత్తడం మొదలెట్టింది జీపు. చెట్లూ చేమా దట్టమవుతున్నాయి. కొండా కోనా గుబురు గుబురుగా ముసుకుని వస్తున్నాయి.

"పాండవు లిక్కడుండేవారట!. . . ఈ గుట్టల్లో పాండవుల మెట్లుంది" అన్నాడు రెడ్డి.

"సీతమ్మ జలకాలాడని చోటూ, పాండవులు తిరగని కొండకోనలూ ఈ దేశమంతా వెదికినా దొరకవు. వాళ్లెందు కొచ్చే రిక్కడికీ?" అన్నాడు జనార్దనం.

"ఎందుకొచ్చేరా?. . . విరట్రాజు కొలువుకి."

"కొలువుకీ దీనికీ సంబంధ మేమిట్రా?"

"అదే ఈ చోటు."

"నీ మొహం. . . వాడిది మత్స్య దేశం. అది బస్తరు ప్రాంతాల్లో... చోడారం మాడుగుల కాదు."

"విరట్రాజుది ఊరుకాదు దేశం. బస్తరులో కొలువుండచ్చు. . . దేశం పాడేరుదాకా పాకిఉండచ్చు."

"పోనీ, అలాగే అనుకో. . . కొలువులో పాండవులు పాడే రెందు కొచ్చేరూ?"

"కొలువులో ముగ్గురే ఉండేవారు. నకులుహా, సహదేవుడూ అడవుల్లోనే తిరిగేవారు."

"ఏం?"

"గొడ్నూ, గుర్రాలూ వాళ్లే చూసు కునేవారటగా!"

"అయితే వాళ్ల ముగ్గురూ ఎందు కొచ్చేరూ?"

"ఏదో సాకు పెట్టి, కొండల్లో కలుసుకుని గుట్టుగా ప్లాను వేసుకునే వారులా ఉంది."

"ఏమిటోరా, రెడ్డీ, నువ్వెన్ని చెప్పినా నమ్మలేన్రా. . . ఇది మత్స్యదేశమని ఋజువేమిటి?" అన్నాడు లాయర్ జనార్దనం.

"పాడేరులో ఏరుంది. బండరాళ్ల మధ్య కిలకిలలాడి, కొండలోయలో దూకి మడుగు కట్టింది."

"ఆఁ!"

"ఆ మడుగుపేరు మచ్చెకుండు. ఆ ఏరుపేరు మాచ్‌కుండ్. . . ఆ మడుగులో తపతపలాడుతూ రంగు రంగుల చేపలు . . . మత్స్యకన్యలు" అన్నాడు రెడ్డి.

"పెద్దవా?" అన్నాడు ప్రకాశరావు లొట్టలేస్తూ.


"సొళ్జెరుపేట బీచిలో చేరే గుంట లంతే సుంటాయి. మత్స్యకన్యలూ... మత్స్యగంధులూ...మచ్చెకంటులూ... బులిపించి చేతిలోంచి జారిపోతాయి. పట్టుకి దొరకవురా, బాబూ. ఒక ఆటాడించేస్తాయి."

"రెడ్డిగాడు కవిత్వం చెబుతున్నాడు రోయ్."

"కవిత్వం కాదురా, ఐడుద్దాయీ, నిజం. ఆ బ్యూటీ కళ్లారా చూడలి. చూస్తే మీరూ పేల్తారు తప్పతాగి నట్టు."

ఆ అందాల అలజడిలో మేలుకుని కన్ను తెరిచేడు రామస్వామి. గుట్టలూ కోనలూ తెగతిరిగేడు. కొండవార గుండంలో రంగురంగుల చేపలు. ఆ చేపలే తోరణం కట్టినట్టు కొండ మీద హరివిల్లు తన్నెన్నిసార్లు చూసేడో ఆ సొగసుల విశ్వరూపం రోజు కో వన్నె, మూల కో చిన్నె. ఎక్కడెక్కడ తల్లంత్ర నోళ్లతో బుల్లిబుల్లి ముద్దులిచ్చి బిల బిలమని జారిపోతాయి రంగులమీనాలు.

హనుమకొండ వేయి స్తంభాల గుడిలోని నంది ఫోటో—డాక్టర్ వేమూరి కామేశ్వరరావు (హైదరాబాదు)



ఆ నీరూ గాలీ అంత. ఆ ఊరి పిల్లలే అంత. గుండంలో చేపల్లాగే ఎప్పుడూ చూపులు ఒకరిమీద నిలవవు.

బొమ్మలాటలో, హరికథల్లో భారతం చాలా సార్లు చూసేడు, విన్నాడు రామస్వామి. 'చదువు చెప్పిన గురువునే చేసుకోమన్నాడు తండ్రి. 'ఓ అలాగే'అంది కూతురు. గురువేసిగ్గుపడి కొడుక్కి కట్టుకుంటానన్నాడు. మారుమాటాడకుండా ఒప్పేసుకుంది. 'తండ్రిమీద కన్నేసింది. కొడుకు పక్కలోకి వెళ్లింది. వయసూ వావీ గోవిందా. మనసవేది ఉంటేనా? ఆ కన్నయ్యగాడు మాత్రం చిన్నోడా చితకోడా? గౌరికి జాబుతోటివాడు. అయినా దానికేం బుద్ధి లేదు? నేల నీరు' అనుకున్నాడు రామస్వామి.

"చిత్తెరే. మచ్చెగుండంలో రంగు జెల్లా పాడేర్లో వడుసుపిల్లా. . . సిక్కినట్టే సిక్కి సెయ్యి సూపిస్తాయి" అని చీదరించుకున్నాడు.

ఏటొడ్డున శివలింగం ముందు ఎన్ని ఒట్లు పెట్టింది? ఎన్ని ముద్దులిచ్చింది? మెట్లమీంచి బండ రాళ్లమీదికి కొవ్వెక్కిన గోరువంకలా ముచ్చటగా గెంతుతూ మచ్చెగుండం దగ్గిర చేరేది. తను బతాజీలు విసిరితే తపతపలాడుతూ తోకలమీద ఎగిరి గాలిలో మొగ్గలేసే చేపల్ని పట్టుకోబోయేది. జారిపోతే ఒయ్యారా లొలక బోస్తూ ఆ పలుగురాళ్ల మధ్య ప్రవాహంలా పకపక నవ్వేది.

"ఆ ట్టట్టుకోకే" అనేవాడు రామస్వామి.

"ఏం?. . . నువ్వట్టుకో సూదాం" అని గుండంలో చేపల్లా రంగులు మిళాయించి కళ్లు మిలమిలలాడించేది.

"ఒట్టుకోనా?" అని నవ్వుతూ మీది కొరిగి గౌరి కళ్లలోకి చూసేవాడు.

"సీ, పోకిరీ సచ్చినోడా. అలా మింగేస్తన్నవు. నా సూపులో ఏటుంది? సేతనైతే ఆట్టట్టుకోరా" అని పైట సద్దుకుని బుగ్గలు సొట్టలు పడేదాకా నవ్వేది.

"నీ కళ్లేసాలే. . . సామిరంగా. . . పసిడిగిడసలు. గుండంలోసేపలెందికే?"

"అబ్బోరి, నాన్నో!. . . పదాలు పాడతన్నవే. . . అలాగే సూస్తా ఉండు. కుండులో దూకి ఎర్రమీనై పోతాను. . . నీకు దక్కన్నా, ఎర్రిబాగులోడా!"

కొలిమిలో సమ్మెటపోటులా లయ తప్పకుండా ముక్కుతూంది కొండువులుగు. టక్కుటక్కుమని వడ్రంగిపిట్ట ముక్కాయిస్తూంది. గాటీ మొదలైంది. నిమిషనిమిషానికీ జీపు మలుపులు తిరిగి ఎగబాకుతూంది. రామస్వామి చేతిలో చక్రం అటూ ఇటూ తెగ తిరుగుతూంది.

"చేపలు...చేపలు ... అసలు పిట్టలు దొరుకుతాయా దొరకవా చెప్పండ్రా? జాలారివాగుడూ మీరూనూ" అన్నాడు విసుగ్గా ప్రకాశరావు.

"పిట్టలా!" అని నవ్వి, "ఏం పిట్టల్రోయ్" అన్నాడు రెడ్డి.

"ఆః పిట్టలు కావురా, బాబూ. గువ్వలు, కొంగలు."

"అవా. . . కొక్కొల్లలు. మడుగులో గుంపులుగుంపులు. పొదలూ పులుగులూ... కన్నులపండుగరా, ప్రకాశం."

వయసు రంగూ, వలపు పొంగూ వరదొస్తే పెద్దమనిషైన పడుచు పిల్లలా కెంపులు చిగురించే తొగరు జేగురు గుబురువృక్షాలూ, నీలాలు నవరించి పచ్చలు పొదిగే కొండపొదలూ, లేతాకుపచ్చ చీరమీద ముదరాకుపచ్చ ముద్దబంతి అద్దకంలా పరుచుకున్న లేతపచ్చికమీద గుబురుతేరిన గున్నమామిడులూ, పెనవేసి పలకరించే తెల్లపూల అడ్డతీవలూ, రాగాలు తీసే పాలవెల్లువలూ, పూలపడుచులూ, తేనెజల్లులూ రామస్వామి కళ్లముందు కదలాడుతున్నాయి. గుండె మల్లెచెండులా విరిసి గుబాళించింది.

"ఈ మట్టి సూడే, గౌరీ. గుమగుమలాడద్ది."

"సీ. . . మట్టికి వాసనేట్రా. . . మూసూడు." అసహ్యించుకునేది గౌరి.


"నీకు తెల్దే. . . ఏసింకాలం కాలికా లుంటదేమో. . . నాలుగు సినుకులు పడగానే సూసుకో. . . నా సామిరంగా, ఒట్టేల్లమీద వానజల్లు కురిసినట్టు గుమగుమలాడిపోద్ది. అనబం తెలియాల. . . సూపిస్తాను ండోపాలి."

"అదేటో నాకు తెల్దుకానీ. . . జల్లు పడ్డాక పెట్లంత సక్కగుంటయిరా!"

"మడుగులో తానవాడి, ఒంటిమీంచి నీటిబొట్లు జారతా ఉంటే, సీరసుట్టబెట్టుకుంటూ ఒడ్డు సేరతావు సూడూ. ఒలే, గౌరీ, అప్పుడు సూడాలే నీ సోకు! గునగునలాడి గట్టెక్కే బాతులా మాగుమా గుంటవే, పిల్లా!. . . ఆ సెట్లేపాటే, నీ ముందు దిగదుడుపే."

ఛీ! ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఆ మాటే తలుచుకో

లింగరాజ దేవాలయం (భువనేశ్వర్)    ఫోటో— జమ్మి కోనేటిరావు (కడప)



కూడ దనుకున్నాడు రామస్వామి. చూపు రోడ్డుమీదా, చెయ్యి స్టీరింగ్‌మీదా లగ్నం చేసేడు. కాలంలాగే జీపు చక్రాలు దొర్లిపోతున్నాయి.

"వాళ్లంతా అదో రకం మనుషులు" అన్నాడు రెడ్డి.

"కొండసరుకు మరి."

"అదికాదురా. . . వాళ్లని చూసి నవ్వకూడదుట."

"నవ్వితే?!"

"సఫా."

"అమ్మ బాబోయ్" అన్నాడు జోగారావు.

"ఆడదాని ఒంటిమీ దెక్కడ చెయ్యేసినా ఫరవాలేదు."

"చిత్రంగానే ఉంది."

"మెడమీద చెయ్యేసేవా సఫా."

"ఏం?"

"కట్టుకున్నవాడే వెయ్యాలి."

రామస్వామి గుండెలో గుబపందిగింది.

"ఓ రెల్లరా, డ్రైవోరూ. . . ఏకాడేటుంది?" ఎత్తిపాడించింది గౌరి.

"ఏటుండాల?" ఉడుక్కున్నాడు రామస్వామి.

"మా అయ్య వడుగు."

"ఆడి మాటకేంలే ఆశబోతోడు. నువ్వేటంటవు?"

"ఆడి మాటే. . . ఆ డప్పు తీర్సి బూమి తాకట్టిప్పాల. వాకట్టి పోద్దని మా అయ్యని దొల్సుకు తినేస్తున్న డా కన్నయ్యగాడు."

"ఆ బాకీ తీర్సడం ఓవుడి తరం? ఒడ్డీలకొడ్డీలు పెరిగిపోతుంటది. పోతేపోయిన బూమిసెక్క. మన పెల్లి కడ్డేటి?"

"ఆ సెక్క మా లప్పుద. నాకు దక్కాల. అణ్ణి కట్టేసుకుంటే అప్పు తీరిపోద్ది."


"అలా వెదవ పని సేసినావంటే అణ్ణి నిమ్మా బద్దిమీదేసి నరికేస్తాను. ఆ డొంయిసేటీ, నీ ఒంయిసేటీ? సిగ్గు నేదు?"

"కన్నోడివా? కట్టుకున్నోడివా? ఏటోరి నీ అదమాయింపు. . . సేతనైతే సేసుకోవాల. . . మనసుంటే మనువాడుకో."

"వాకాడ డబ్బేదీ? మీ మొయ్యనుడే."

"అంత మనువుంటే తెచ్చుకోవాల!" [illegible] అనేసి మూతి ముడుచుకుని [illegible] మాట చెప్పేసింది గౌరి.

రామస్వామి మనసులో ముళ్లకంప [illegible] మళ్లీ గడించు కోవాలనుకున్నాడు. కొంపా గోడూ




చిత్రం – రుక్మిణి (డోర్నకల్)

అమ్మి పారేసేడు. తల తాకట్టు పెట్టి, డబ్బు పోగుచేసేడు. ఉవ్విళ్లూరుతూ లారీ దిగేడు. సంజవేళ శివలింగం ముందు గౌరికి శుభవార్త చెబుదాం అని గుడి దగ్గరికి వెళ్లేడు. గౌరి కనబడలేదు. కాని వినబడుతూంది. గౌరి పకపకలా, ఏటి గలగలలా? పొంచిఉన్న పులిలా మెట్లమీంచి బండ రాళ్లమీదకి ఒక్క దూకు దూకేడు. కుండువేపు చూసేడు.

టాప్‌గేరులో వెళుతూంది జీపు. వడగాలి రివ్వురివ్వుమని గూబల్లోనించి దూసుకుపోతూంది. వెన్నెల్లో నల్ల తాచులాగ తారురోడ్డు నిగనిగలాడు తూంది. దూరంగా మండుటెండలో అస్తవ్యస్తంగా ఆకారా లేవో గజిబిజిగా మెదులుతున్నాయి.

బండలమీద కూర్చుని కుండులో తపతప కాళ్లాడిస్తూంది గౌరి. కన్నయ్యగాడు గౌరి మెడమీద చెయ్యేసి పైట తప్పించి ఒళ్లంతా ముద్దాడుతున్నాడు. కితకితలుపడ్డ గౌరి ముడుచుకుపోతూ గువ్వలా కువకువ లాడుతూ కన్నయ్య ఒడిలో కులుకు తూంది.

కాలికింద బండరా యనుకుని ఎక్సిల రేటర్ తొక్కిపారేశాడు రామస్వామి. రోడ్డుమీద మసకమసక రూపాలు రక్త మాంసాలు పోసుకుంటున్నాయి. గౌరిలా గుంది. గౌరే రోడ్డు కడ్డంగా పరి గెట్టింది. కళ్లు బైర్లు కమ్మేయి రామస్వామికి. కసితీరా బ్రేకు నొక్కేడు. కీచుమంటూ మెలికలు తిరిగిపోయింది జీపు.

"ఓలమ్మో . . . సచ్చిపోనానే."

రోడ్డువార చింతచెట్టుకి ఢీకొని ఆగిపోయింది జీపు. రామస్వామికి స్పృహ తప్పింది.

"ఓలమ్మో, సచ్చిపోనాను. . ."

కన్నయ్యగాడి కౌగిల్లో కులుకుతున్న గౌరిని చూసి కుతకుతలాడిపోయేడు రామస్వామి. కొండమీద కారుమబ్బు పెళ్లుమంది. తళుక్కుమని బీటలు పడింది.

"జిత్తులమారి లంజా!" అని కసితీరా నేల తన్నేడు ఉగ్రుడైపోయి.

బండరాయి పట్టు పడలి, ఊగి ఊగి దొర్లిపోయింది.

"ఓలమ్మో, సచ్చిపోనాను ... కటిక సచ్చినోడా ఎంత పని సేసినావురా" అంటూ గుండె లదుముకుంటూ నిలబడి కన్నయ్యని వెనక్కి తోసేసి, మీద బండ పడకుండా కాసుకుంది గౌరి.

కుండులో బండ కూరుకుపోయింది. బిక్కచచ్చిపోయి కన్నయ్య గుండెల్లో మొహం దాచుకుని బిక్కుబిక్కు మంటూంది గౌరి.

జీపులో రామస్వామి తెప్పరిల్లేడు. రోడ్డుమీద అడ్డుగా పరిగెట్టిన గౌరి కోసం దిక్కులు చూసేడు. ఆ పిల్ల ఎవరో బిక్కచచ్చి బిక్కుబిక్కు మంటూంది.

కన్నయ్యా, గౌరీ ఆ మరునాడే తుర్రుమన్నారు. మనసిచ్చిన గువ్వపిట్ట పిటకాకితో ఎగిరిపోయింది. నిండు ప్రాణాల్నే తీసేద్దామనుకున్నాడు దుర్మార్గుడు అని అందరూ రామ స్వామి మొహంమీద ఉమ్మేశారు.

కుండులో ఎర్రజెల్లా, బండమీద గౌరిపిల్లా దక్కలేదు. దగా పడ్డాడు రామస్వామి. మనసు చిరిగినచోట ఉండ లేక పోయేడు. కొండ దిగి పట్నం చేరు కున్నాడు.

ఆ పిల్ల కారుకింద పడి కొనఊపిరితో ఉంటే తను చెయ్యబోయే ప్రథమ చికిత్స ఏమిటా అనుకుంటున్నాడు జోగారావు. తీరా చస్తే కోర్టులో చెప్పవలసిన సాక్ష్యం మననం చేసు కుంటున్నాడు జనార్దనం. 'జీపు చేతిలో ఉన్నా, కాలం మన చెప్పుచేతల్లో లేదు మరి. కోర్టులూ, సాక్ష్యాలూ అలవాటే. ఎప్పుడూ ఉన్నవే' అను కుని పాడేరు నీలాకాశంలో గురి తప్పిన కొంగలబారుని ఊహాపథంలో రంగు రంగుల కుంచెలతో చిత్రించుకుంటు న్నాడు ప్రకాశరావు. పచ్చడైపోయింది జీపు. ఇన్సూరెన్సువాళ్లు పేచీలు పెట్టకుండా కొద్దో గొప్పో పారేస్తారా లేదా అని ముళ్లమీ దున్నాడు రెడ్డి.

మమత నీడలాంటిది. వద్దంటే వెంటబడుతుంది. అందుకోబోతే చేతికి దొరకదు.

'మళ్లీ పాడే రెళ్లగలవా!' అను కున్నాడు రామస్వామి. ★